మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం
### -బిజెపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, నవంబరు 24 (ప్రభాతవార్త):** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకి ప్రాణం పోసిన రాజ్యాంగం ముసాయిదా చేపట్టిన చారిత్రాత్మక దినం నవంబరు 26, జాతీయ రాజ్యాంగ దినోత్సవం, జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను స్మరించుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, మండల అధ్యక్షుడు ఉషారి చంద్రం అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బి కాలనీలోగల సింగారం అంబేద్కర్ విగ్రహంవద్ద నవంబరు 26 నుండి జనవరి 26 వరకు జరిగే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలందరు జరుపుకోవాలని, ప్రతి పాఠశాలలో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ సమయంలో చదివించాలని సూచించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు.

## తెల్లాపూర్‌లో 21 లక్షల 42 కిలోల గంజాయి పట్టివేత
### -పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు-ఒకరు పరారీ

**రామచంద్రాపురం, నవంబరు 24, (ప్రభాతవార్త):** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం అక్రమంగా నిల్వ ఉంచిన 42 కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్‌ఓటి, కొల్లూరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో గంజాయి స్మగ్లర్ స్థావరాలపై దాడి నిర్వహించారు. తెల్లాపూర్‌లోని ఓ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంప్‌లో గంజాయిని దాచి ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి అక్రమంగా నిల్వఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి భారీగా ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పోలీసుల జరిపిన విచారణలో తేటతెల్లమయింది.పట్టుబడిన ఎండు గంజాయి విలువ రూ. 21లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. స్మగ్లర్లు బెంగాల్‌కు చెందిన మిథున్ భర్మా, సుజేన్ రాయ్, షేక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు బిస్వా తప్పించుకుని పరారీలో ఉన్నట్లు వివరించారు. పట్టుబడిన గంజాయి, నిందితులను పోలీసులు మాదాపూర్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించడానికి సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అందజేసిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో 123 మంది దరఖాస్తులను అందజేసినట్లు వివరించారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, ఏవో రాజ్‌కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
### -ప్రజావాణిలో సంగారెడ్డి జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్


ప్రజావాణిలో పాల్గొన్న ఎస్పి పరితోష్ పంకజ్

**సంగారెడ్డి టౌన్, నవంబరు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పి పరితోష్ పంకజ్ పాల్గొని ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పి పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఎస్పి ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి తగు సూచనలు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను స్థానిక పోలీసు ఠాణాలో పరిష్కారం దొరకకుంటే మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రజావాణిలో అందుకున్న ప్రతి ఫిర్యాదు పురోగతిపై నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు సత్వర పరిష్కారం అందేలా కృషి చేస్తామన్నారు.

### తెలంగాణ గోల్డ్ కప్ 2025-టి20
## టోర్నమెంట్‌కు క్రికెట్ జట్టు ఎంపికలు



మాట్లాడుతున్న టి.క్రికెట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నరేందర్‌రెడ్డి

**సిద్దిపేట అర్బన్, నవంబరు 24, ప్రభాతవార్త :** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ గోల్డ్ కప్ 2025-టి20 టోర్నమెంట్‌కు జిల్లా కేంద్రంలో, గజ్వేల్ పట్టణంలో క్రికెట్ జట్టు ఎంపికలు జరుగుతున్నట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ చెందిరెడ్డి నరేందర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ హరి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రికెట్ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకరావడానికి గోల్డ్‌కప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుడు ఎంపికలో పాల్గొనాలన్నారు. ఎంపికలు పూర్తిగా మెరిట్ ఆధారంగా పారదర్శకంగా జరుగుతాయన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రంలో ఐదు జోన్లుగా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తుందన్నారు. సిద్దిపేట జిల్లా జట్టును సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్ వేదికగా నిర్వహించడం జరుగుతుందన్నారు.టోర్నమెంట్ ఫైనల్ హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 26న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో, గజ్వేల్ పట్టణంలోని ఎల్‌ఓసి మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో రావాలన్నారు. పూర్తివివరాలకోసం 7780596892, 9704626760, 9030078997,8919641716 నంబర్లను సంప్రదించాలన్నారు.

## సరాఫ్‌పల్లిలో జోరుగా ఇసుక అక్రమ వ్యాపారం
### -మంజీర నది నుంచి ఇసుకు తరలింపు

**పుల్‌కల్, నవంబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాఫ్‌పల్లిలో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గ్రామ శివారులోని ప్రవహిస్తున్న మంజీర నదినుంచి అక్రమార్కులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు మంజీర నది వరకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసుకుని రాత్రి పగలు తేడాలేకుండా నది గర్భం నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చుతున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా కూలీల సహాయంతో ట్రాక్టర్‌లలో ఇసుకను నది ఒడ్డుకు తరలించి నిల్వ చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక లోడ్‌ను రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు తమ జేబులు నింపుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు అడ్డుకుని పోలీసు ఠాణాకు తరలించి నది ఒడ్డున నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను రెండు మూడు రోజుల్లో వేలం వేస్తామని తహసీల్దార్ కిష్టయ్య పేర్కొన్నారు.



ఇసుకును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు, ట్రాక్టర్‌ను పట్టుకుని ఆర్ఐ

# త్వరలో సిఎం జిల్లా పర్యటన
### ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి.. సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో సిఎం రేవంత్‌రెడ్డి త్వరలో పర్యటించనున్నారని... పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, అన్ని శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించి పలు సూచనలు, కీలక ఆదేశాలు జారీ చేసి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే చోట అధికారులు ఇప్పటినుంచే పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణల కోసం ఇప్పటికే కేటాయించిన స్థలాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వెంటనే ప్రారంభించి అర్హులైన లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో నాలుగు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో వర్షాల ప్రభావం వల్ల పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకునేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం తడవకుండా ఉండేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయో లేదా ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న మెదక్ జిల్లా కాంగ్రెస్ డిసిసి నూతన అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
### డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, నవంబరు 24 , ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచూపి జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శివన్నగారి ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం రెండోసారి డిసిసి అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించి మెజార్టీ స్థానాల్లో గ్రామపంచాయతీలను కైవసం చేసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని తాను ఎన్‌ఎస్‌యుఐ నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభించానని అటు తర్వాత యూత్ కాంగ్రెస్ నాయకుడిగా, కాజీపేట ఎంపీటీసీగా పదవులు చేపట్టానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కోసం చేస్తున్న కృషిని గమనించి అధిష్టానం తనకు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించడం జరిగిందన్నారు. డిసిసి అధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర మంత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లేషం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, బిసిసెల్ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, రుస్తుంపేట మాజీ ఎంపిటిసీ ఆశోక్, మహిళా నాయకులరాలు వినోద నాయకులు పాల్గొన్నారు.

## కుస్తీపోటీలలో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

**నారాయణఖేడ్, నవంబరు 24 ప్రభాతవార్త :** పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. వీరు గత రెండు రోజులుగా హైదరాబాద్ లోని జీహెచ్‌ఎంసీ రెడ్ హిల్స్ మైదానంలో జరిగినటువంటి కుస్తీ పోటీలలో మంచి ప్రతిభ కనపరచి మూడు బహుమతులు కైవసం చేసుకున్నారు. అందులో ఒకరు చాంద్ సబ్ సిల్వర్ మెడల్, ఇర్ఫాన్, రహమాన్ బ్రోన్జ్ మెడల్స్ సాధించడం జరిగింది. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు పాఠశాల కోఆర్డినేటర్ జాకీర్, సంజీవ నాయక్ వ్యాయామ ఉపాధ్యాయులు అజీజ్, సంతోష్ మరియు పాఠశాల సిబ్బంది వీరిని శాలువతో సత్కరించి అభినందించారు.

## యూనిటీ మార్చ్‌కి తాటికొండ శ్రీనివాస్ ఎంపిక

**సిద్దిపేట అర్బన్, నవంబరు 24, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశమంతటా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌కి తాటికొండ శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదారాబాద్‌లోని నాంపల్లిలో ప్రారంభం అయి యూనిటీ మార్చ్ నాగపూర్‌లో ప్రారంభమై ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద 30న ముగిస్తుందన్నారు. జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన మెదక్ ఎంపి రఘునందన్‌రావు, జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణని నిజం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ వాయువులు వచ్చేలా ఆపరేషన్ పోలో చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి : సిపి

**కొండపాక, నవంబరు 24, ప్రభాతవార్త :** సోమవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డులోని బస్ స్టాప్‌ను సందర్శించారు.ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రదేశంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటి నివారించడానికి చర్యలు తీసుకొవడం జరుగుతుందన్నారు. అటోలు బస్‌స్టాఫ్ వద్ద రోడ్డుపై పెట్టవద్దని సూచించారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. నాలుగువైపుల రోడ్డును, వాహనాల రాకపోకలను పరిశీలించి ప్రమాదాలు నివారణకు తీసుకొవాల్సి చర్యలను సిఐ,ఎస్సైలకు సూచించారు.

## ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం
### టిఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఉద్యోగులకు క్రమశిక్షణ, సంఘ కట్టుబాటు చాలా కీలకమని...ఉద్యోగులకు ఎలాంటి సమస్యలైనా సంఘం ద్వారానే పరిష్కారం చేసుకోవాలని టిఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. రంగనాయకసాగర్ నీటిపారుదల శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘ నియమాలు, కట్టుబాట్లు ఉల్లంఘించినట్లయితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కారం లభించేలా సంఘం అత్యున్నతస్థాయిలో కృషి చేస్తుందన్నారు. నీటి పారుదలశాఖ ఉద్యోగులు అందరూ తన సొంతశాఖ మనుషులని వారికి ఏ కష్టం రాకుండా చూసుకునే బాధ్యత సంఘంపై ఉందని కష్టం వస్తే జిల్లా అధ్యక్షులను కలువాలన్నారు. పిఏవో వద్ద పెండింగ్ బిల్లులను వేయించామని త్వరలోనే క్లియర్ కావడానికి సంఘం తరపున కృషి చేయడం జరుగుతుందన్నారు. గజ్వేల్ యూనిట్లో పదోన్నతులు ఇవ్వకపోవడం ద్వారా ఉద్యోగులు ఇబ్బందులకు గురువుతున్నా రని వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. 2021లో రీ అర్గనేషన్ కారణంగా జూనియర్ అసిస్టెంట్లు ఇతర జిల్లాలకు బదిలీ చేయడం వలన గణనీయమైన నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా టిఎన్జీవోస్ కార్యదర్శి కోమాండ్ల విక్రమ్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


టిఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

## తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన పాప

**గజ్వేల్ టౌన్, నవంబరు 24 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన ముత్యాల వినయ్‌కుమార్ కూతురు మనస్విని(4) సోమవారం గజ్వేల్‌లోని మార్కెట్‌లో కూరగాయలు తీసుకుంటుండగా తప్పిపోయింది. వెంటనే డయల్ 100కు ఫోన్ చేయగా గజ్వేల్ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కృష్ణ, కరుణాకర్‌లు వెంటనే ఆ ప్రదేశానికి వెళ్ళి వెతికి పాపను గుర్తించి తల్లిదండ్రులను సురక్షితంగా అప్పగించారు.


పాపను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

# ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక
### తూతూ మంత్రంగా కొనసాగించిన అధికారులు

**చేర్యాల, నవంబరు 24, ప్రభాతవార్త**
మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నివేదికలపై సామాజిక తనఖీ బృందం వెలుగుతీసిన అంశాలపై సంబంధిత ప్రజావేదిక అధికారులు నిర్ణయాలను తూతూ మంత్రంగా కొనసాగించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో 18 గ్రామాలకు సంబంధించి జిల్లా అధికారులు ఆడిట్ నిర్వహించారు. మొత్తం. రూ. 8 కోట్ల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ కొనసాగగా ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శిలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేసిన పనులపై సోషల్ ఆడిట్ టీం అందజేసిన వివరాలపై జిల్లా సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. సాగులో ఉన్న భూమిలో పనులు చేయించడం, కూలీల సంతకాలు లేకుండా డబ్బులివ్వడం, 7 రిజిస్ట్రార్లు సరిగా మొయింటనేన్స్ చేయకపోవడంతో పాటు 3 నెలలకొకసారి ఎంపిడీవో, ఏపివో వెరిఫికేషన్ చేయాలి కాని చేయడం లేదని సోషల్ ఆడిట్ వారు తెలిపారు. అలాగే ఎంపిడీవో, ఈసి రోల్ కాల్ చేయాల్సిందిపోయి చేయడం లేదన్నారు. వర్క్ ఫైల్స్‌లో 18 రకాల డాక్యూమెంట్స్ పెట్టాలి కాని పూర్తి స్థాయిలో పెట్టడం లేదని తెలిపారు.ఐదు గ్రామాల్లో పశువుల పాకకు సంబంధించి అదనంగా అటాచ్ రూమ్స్ కట్టినట్లు గుర్తించినప్పకీ బిల్లులు చెల్లించినట్లు తేలింది.మస్టర్సు ల్లో ఎక్కురోజులు పని చేసిన వారికి తక్కువ రోజులు చేసినట్లు, తక్కువ రోజులు పనిచేసినవారికి ఎక్కువ రోజులు చేసినట్లు వేసి పేమెంట్ చేసినట్లు అలాగే మస్టర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలు ఉన్నట్లు గుర్తించారు.పంచాయతి కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా ఉండటం వల్ల తప్పిదాలు జరిగినట్లు తెలపడంతో జిల్లా అధికారులు నామ మాత్రంగా గుర్తించి ఈ ఆడిట్‌లో 19 వేల రికవరి, 27వేల ఫైన్లు వేసినట్లు అధికారులు వివరించారు.ఈ విషయంపై విలేకరులు సంబంధిత అధికారులను పూర్తి వివరాలు అడిగే ప్రయత్నం చేయగా దాటవేసి కార్యక్రమం ముగించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జిల్లా అధికారులు కార్యక్రమంలో తీసిన వీడియో టెలికాస్టును పూర్తిగా విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డిఆర్‌డివో శ్రీనివాస్, ఎంపిడీవో ప్రణయ్, డివివో గణేష్, క్యాసి సంతోష్‌రెడ్డి, ఏపిడి సతీష్, అంబూర్స్‌మెన్ ఆరీఫ్, ఏఈ శివకుమార్, ఏపివో మంజులా, ఎస్ఆర్పీ పాండురంగ, పంచాయతి కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఇనుము

## ఇనుపపైపుల చోరీ కేసులో 11 మంది అరెస్ట్
### రూ.40 లక్షల ఇనుము, రూ.3,95 లక్షల నగదు
### రెండు క్రేన్లు, లారీలు, గ్యాస్ కట్టింగ్ మిషన్ల స్వాధీనం

**సిద్దిపేట రూరల్, నవంబరు 24, ప్రభాతవార్త:** సిద్దిపేట వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గాడిచెర్లపల్లి శివారులోని మెగాకంపెనీ యార్డు నుంచి ఇనుప పైపులను దొంగిలిస్తున్న ముఠాను సోమవారం అరెస్టు చేసి రూ.40 లక్షల విలువగల 60 టన్నుల ఇనుము, రూ.3,95 లక్షల నగదు, రెండు క్రేన్లు, బొలెరో వాహనం, రెండు లారీలు,నాలుగు గ్యాస్ కట్టింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎసిపి కథనం ప్రకారం... గాడిచెర్లపల్లి శివారులో గల మెగా కంపెనీలో రంగనాయకసాగర్ కాలువకు సంబంధించిన 8 ఇనుప పైపులను దొంగిలించినట్లు మెగా కంపెనీకి చెందిన సాగర్ 19న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసు అధికారులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గాలింపు చర్యలో భాగంగా 11 మంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించగా పైపులు దొంగిలిస్తున్నట్లు అంగీకరించారని చెప్పారు. బీహార్‌కు చెందిన రోహిత్ తంతి,చాలమల్ల వెంకట్‌రెడ్డి, ములుగు సాయికుమార్, కాకి శ్రీనివాస్, ఎం.డి.లియాఖత్, ఎం.డి.వాజిద్, నేరెళ్ల శ్రీకాంత్, ముంగిస్పల్లీ, పొన్నాల రమేష్, పొన్నాల సతీష్, పవన్‌లు కలిసి ఐరన్ పైపులను కట్ చేసి ముక్కలుగా చేసి క్రేన్ల ద్వారా లారీలలో తీసుకెళ్లి స్క్రాప్ ఓనర్ శ్రీనివాస్ సూచనల మేరకు మనోహరాబాద్, శంకరంపేట ఐరన్ కంపెనీలోవేసి వచ్చినడబ్బులు వెంకట్‌రెడ్డి, రోహిత్ తంతి, శ్రీనివాస్, సాయిలు పంచుకున్నారని తెలిపారు.వెంకట్‌రెడ్డి గతంలో మెగా కంపెనీలో పైపులకు పెయింటింగ్ వర్క్ కాంట్రాక్ట్‌గా పనిచేశారని రోహిత్ తంతి మెగా కంపెనీలో పైపు వెల్డింగ్ కాంట్రాక్టుగా పని చేశారని తెలిపారు. గతంలో రోహిత్ కంపెనీలో పైపులు దొంగిలించిన అనుభవం ఉందన్నారు. దొంగిలించిన రూ.40 లక్షల ఇనుము రికవరీ చేసినట్లు చెప్పారు.

## పట్టపగలే వృద్ధురాలి నుంచి పుస్తెలతాడు అపహరణ

చేర్యాల, నవంబరు 24,ప్రభాతవార్త పట్టపగలే ఇంట్లో చొరబడి ఓ వృద్ధురాలు మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించిన సంఘటన ముస్త్యాల గ్రామంలో జరిగింది. మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బాధితురాలు సొంటె నర్సవ్వ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన దుండగుడు తలకు హెల్మెట్ ధరించి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్నా మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లి బైక్‌పై పరారయ్యాడు.దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందివ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభిస్తున్నారు .దీంతో వరస దొంగతనాలు జరగడంతో పోలీసులకు సవాల్‌గానే మారింది.

## 12 మంది మందుబాబులకు రూ.లక్షా 20వేల జరిమానా
### -ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష

**గజ్వేల్ టౌన్, నవంబరు 24(ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి రూ.లక్షా 20వేల జరిమానా విధించడంతో పాటు ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మందిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి 12 మందికి రూ.లక్షా 20వేల జరిమానా విధించడంతో పాటు ప్రజ్ఞాపూర్‌కు చెందిన గడ్డం విష్ణు, పాములపర్తికి చెందిన శ్రద్ధ శేఖర్‌లకు రెండు రోజుల శిక్ష విధించినట్లు తెలిపారు.

## పాఠశాల బస్సులో చెలరేగిన మంటలు
### -డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు

**జహీరాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని రావూస్ ఇంటర్‌నేషనల్ స్కూలక్ష బస్సుకు సోమవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం పాఠశాల ముగిసాక విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులో ఎక్కించుకుని వెళుతుండగా బ్యాటరీ నుంచి పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన డ్రైవర్ బస్సును రహదారి పక్కన ఆపి మంటలను అదుపు చేశారు. బస్సులో ప్రమాదం చోటుచేసుకున్న తరుణంలో 36 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పడంతో విద్యార్థులు, పోషకుల,బాధ్యులు ఊపరి పీల్చుకున్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

**జగదేవ్‌పూర్, నవంబరు 24 (ప్రభాతవార్త):** విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన మునిగడప గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన ముచ్చపతి మశ్చేందర్ తన వ్యవసాయ పొలం వద్ద తాడుతో ఆవును కట్టివేసి మధ్యాహ్న సమయంలో అక్కడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. పరిసరాల్లో ఉన్న రైతులు ఈ విషయాన్ని గమనించి రైతు మశ్చేందర్‌కు తెలుపడంతో అక్కడికి చేరుకొని బోరున విలపించాడు. ఆవు విలువ సుమారు రూ.90వేల వరకు ఉంటుందని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు న్యాయం చేయాలని రైతు మశ్చేందర్ ప్రభుత్వాన్ని కోరారు.


మృతి చెందిన ఆవు


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## జనావాసాలకు దూరంగా ఇథనాల్ కర్మాగారం ఏర్పాటు చేసుకోవాలి : సిపిఎం

**బెజ్జంకి, నవంబరు 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల, పోతారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఇథనాల్ కర్మాగారంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర ముప్పు వాటిల్లనున్నదని సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఇరు గ్రామాలను నాయకులతో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. ఇథనాల్ కర్మాగారం వల్ల స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని మాయమాటలు చెప్పిన కర్మగార యంత్రాంగం ఇప్పుడు గ్రామస్తుల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. కర్మగారం వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా పెద్ద ఎత్తున శబ్దాలు వెలువడుతున్నాయని, దీంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. జనావాసాలకు దూరంగా నిర్మించాలని నిర్మాణ దశలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. పరిసర గ్రామాల ప్రాంతాల్లో భూసారం దెబ్బతినడంతోపాటు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇథనాల్ కర్మగారం రద్దుచేసి జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ పాల్గొన్నారు.

## గౌరవెల్లిలో చీరల పంపిణీ



**అక్కన్నపేట, నవంబరు 24, ప్రభాతవార్త :** మండలం గౌరవెల్లి గ్రామంలో ఇందిరా మహిళాశక్తి చీరలకు మహిళా సంఘాల సభ్యులకు సోమవారం ఏపీఎం సురేందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చీకట్ల కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాండ్రాల దాము, సోషల్ మీడియా నాయకుడు మంద పరుశురాం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి సదానందం, సిఏ జ్యోతి, కార్యదర్శి నిర్మల, వివో సంఘాల అధ్యక్షులు, మహిళా మణులు, తదితరులు, పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల సాధన సభకు హుస్నాబాద్ మాలలు


ఢిల్లీ బయలుదేరిన మాల మహానాడు నాయకుల దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 24, ప్రభాతవార్త :** జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 25,26 తేదీలలో(నేడు, రేపు) ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జరిగే రాజ్యాంగ హక్కుల సాధన సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి మాల మహానాడు నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఢిల్లీ వెల్లిన వారిలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిశోర్, నాయకులు జాల శ్రీనివాస్, సుంకే రమేష్, ద్యాగల సతీష్, మహేందర్, వేరంగి సాయి, పరమేష్, జాల రాజయ్య ఉన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన తూంకుంట ఆంక్షరెడ్డి


మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆంక్షరెడ్డి

**గజ్వేల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తూంకుంట ఆంక్షరెడ్డి సోమవారం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేము నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిలను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంక్షరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమించినందుకు పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు రుణపడి ఉంటానన్నారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి పర్యవేక్షణ కమిటీ సభ్యులు బెజుగామ శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, వర్గల్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులను కించపరిచిన సారయ్యపై చర్యలు తీసుకోవాలి

**గజ్వేల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** జేడి సారయ్య ఇటీవల పాడిన పాటలో బ్రాహ్మణులను కించపరిచే విధంగా పదాలను ఉపయోగించి మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు దేశపతి శంకరశర్మ డిమాండ్ చేశారు. సోమవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ రవికుమార్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారని, ఇలాంటి నాస్తికవాదులు కుల మతాలను రెచ్చగొడుతూ సమాజంలో చీడపురుగులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బ్రాహ్మణులపై దాడి చేయడమంటే సనాతన ధర్మంపై దాడి చేసినట్లేనని, ఈ విషయంలో జేడి సారయ్యను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి రేబల్లి రవీందర్‌రావు, కోశాధికారి విఠాల కృష్ణమూర్తి, న్యాయ సలహాదారులు అష్టకాల కిరణ్‌సాగర్ రావు, వివి రమణ, మధురావు, మోహన్‌రావు, మోహన్‌శర్మ ఉన్నారు.


సిఐకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

# పత్తి దిగుబడి తక్కువైంది... కొనుగోలు పరిమాణాన్ని పెంచండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు పత్తి రైతుల వినతి


వంట నష్టపోయిన రైతు తారవ్వను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 23, ప్రభాతవార్త**

పత్తి కొనుగోలు పరిమాణాన్ని 7 నుండి 9 క్వింటాళ్లకు పెంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పత్తి రైతులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. సోమవారం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చిన బండి సంజయ్‌ని పత్తి రైతులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. వాతావరణ పరిస్థితులు, నీటి సమస్యలు, మార్కెట్ అస్థిరతవల్ల తాము తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ తరుణంలో ఎకరాకు 7 క్వింటాళ్లను మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐ నిర్ధారించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పత్తి రైతుల సంక్షేమం కోసం చొరవ తీసుకుని తక్షణమే సీసీఐ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఈవిషయంపై సీసీఐ అధికారులు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. మరోవైపు హుస్నాబాద్ ఆసుపత్రికి వచ్చిన బండి సంజయ్‌ను ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పండించిన వడ్లన్నీ కొట్టుకుపోవడంతో కన్నీరుమున్నీరైన రైతు తారవ్వ కలిశారు. తారవ్వకు నష్టం జరిగిందని తెలిసిన వెంటనే బండి సంజయ్ ఆరోజు ఢిల్లీ నుండి తారవ్వకు ఫోన్ చేసి బాధపడొద్దని తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిస్తున్నట్లు భరోసాఇచ్చారు. ఆ మరుసటి రోజే బీజేపీ నేతల ద్వారా తారవ్వకు రూ.50 వేల సాయం అందించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్‌ను కలిసిన తారవ్వ సంజయన్నా... దేవుడిచ్చిన అన్నవు నువ్వు, మీ సాయం జన్మలో మర్చిపోలేను. ఆరోజు పంట నష్టపోయి పుట్టెడు దుఖంలో ఉంటే ఫోన్ చేసి భరోసా ఇచ్చినవ్. సాయం చేసినవ్. నువ్వు నిండా నూరేళ్లు సల్లగా ఉండాలి అని కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

### ఎన్నికల నిర్వహణలో అధికారులు
## బాధ్యతాయుతంగా పనిచేయాలి
### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, నవంబరు 24, ప్రభాతవార్త :** ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయంగా పనిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, నియమ నిబంధనలపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు బ్యాలెట్ బాక్స్ గురించి, నామినేషన్ ప్రక్రియ గురించి, పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**కార్మికులు బీమా సదుపాయన్ని సద్వినియోగం చేసుకోవాలి...**

భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక భీమా పెంపు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల బీమా పెంపు సదస్సులు ఈనెల 24 నుంచి వచ్చేనెల 8వ తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### సదాశివపేటలో వీరాంజనేయస్వామి
## విగ్రహప్రతిష్టాపన మహోత్సవం

**సదాశివపేట, నవంబరు 24 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీహనుమాన్ నగర్ వీరాంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవం, స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి శ్రీమద్ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వర జగద్గురు 1008 డా. చంద్రశేఖర శివాచార్య మహాస్వాములు రావడంజరిగిందని ఆలయ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాశీ జగద్గురువులు ఒకరోజు ముందుగానే సదాశివపేటకు రావడంతో అంగరంగ వైభవంగా వికారాబాద్ రోడ్‌లోగల హనుమాన్ మందిర్ నుండి దీప కాంతులతో మహిళామణుల కోలాటాల నడుమ వైభవంగా కాశీ జగద్గురువులను, ధ్వజ స్తంభ ఊరేగింపు వైభవంగా కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 24 సోమవారం ఉదయం కాశి జగద్గురువులు నూతనంగా నిర్మించినటువంటి దేవాలయాన్ని సందర్శించి ఆంజనేయస్వామి విగ్రహానికి మరియు ధ్వజస్తంభానికి జల సంప్రోక్షణ గావించడం జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు.తదుపరి ఆలయ అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యులు కాశి జగద్గురువులకి పాదపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కాశి జగద్గురువులు మంగళ ఆశీస్సులు అందజేస్తూ ఒక కుటుంబం సంతోషంగా ఉండాలి అంటే గృహం తప్పనిసరి అదేవిధంగా గ్రామము పట్టణము ఈ ప్రపంచమంతా సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఊరిలో దేవాలయం తప్పనిసరి అని అన్నారు.ఆంజనేయస్వామి దేవాలయం అద్భుతంగా నిర్మించడం జరిగింది ఆంజనేయస్వామి భక్తులందరి లోపట గొప్ప దృఢమైనటువంటి శక్తిని ప్రసాదించాలని జగద్గురువులు మంగళ ఆశీస్సులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తంగడపల్లి ఆశ్రమ పీఠాధితులు షటస్థల బ్రహ్మ 108 శ్రీ శివయోగి శివచార్య మహాస్వామి, బర్దిపూర్ ఆశ్రమ పీఠాధితులు శ్రీ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, ఆలయ ప్రధాన అర్చకులు శివకోటి స్వామి, అర్చక పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## రామకోటి రామరాజుకు ఘన సన్మానం

**గజ్వేల్ టౌన్, నవంబరు 24 (ప్రభాతవార్త):** 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక, కళారంగంలో విశేష సేవలు అందిస్తున్న రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డుగ్రహీత రామకోటి రామరాజును సోమవారం శ్రీసత్యసాయిబాబా భక్త బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సత్యసాయిబాబా 100వ జయంతి సందర్భంగా కర్బూజకాయపై సత్యసాయిబాబా చిత్రాన్ని రూపొందించి మందిరానికి అందించిన సందర్భంగా తనను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.కొన్ని సంవత్సరాలుగా సత్యసాయిబాబా చిత్రాన్ని బియ్యం, నానాలు, ఆవాలు, పప్పులు, సునేరు, చెంమ్కీలతో చిత్రించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం వినూత్నంగా కర్బూజకాయపై చిత్రించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు దేశపతి శంకరశర్మ, కన్వీనర్ చెలిమేటి వెంకటేశం, కల్లూరి రాములు, శ్రీహరి, శ్రీనివాస్, నర్సింగరావు, గంగిశెట్టి సుధాకర్, గిరిధర్, రాయరావు తదితరులు పాల్గొన్నారు.


గీతన్నల రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## గీతన్నల రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయండి
### -కెజికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి

**గజ్వేల్ టౌన్, నవంబరు 24 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించాలని, కల్లుగీత వృత్తిని ఆధునీకరించి వృత్తిలో ఉపాధి పెంపొందించాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఈనెల 28వ తేదీన సూర్యపేట పట్టణంలో జరగనున్న గీతన్న రణభేరి బహిరంగ సభను కల్లుగీత కార్మికులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కెజికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్ ఎక్సైజ్ సర్కిల్ కమిటీ అధ్యక్షుడు పల్లెపాటి కనకయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్అండ్ఆర్ కాలనీ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల కల్లుగీత కార్మికుల సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గజ్వేల్‌లోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఉంటున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాల కల్లుగీత కార్మికుల లైసెన్స్‌లు చేర్యాల, మిర్‌దొడ్డి ఎక్సైజ్ పరిధిలో ఉన్నాయని, వాటిని గజ్వేల్ ఎక్సైజ్ పరిధిలోకి ట్రాన్స్‌ఫర్ చేయాలని, ముంపు గ్రామంలో ఉన్న గీత కార్మికులకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని, అందులో ఈత చెట్లు పెట్టుకునేలా చెట్లను ఇవ్వాలని, కల్లు అమ్ముకోవడానికి స్థలం కేటాయించాలని, ఎల్లమ్మ గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం జరిగిందని, కల్లుగీత కార్పోరేషన్‌కు నిధులు కేటాయించి గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం గీతన్నల రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించడంతో పాటు ఆర్అండ్ఆర్ కాలనీ కమిటీ, మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదాగౌడ్, అంజాగౌడ్, ఎర్రవల్లి భాస్కర్‌గౌడ్, వెంకటేశంగౌడ్, కృష్ణగౌడ్, రవిగౌడ్, నరేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నర్సాగౌడ్, బిక్షపతిగౌడ్, శ్రీనుగౌడ్, రామాగౌడ్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**సంగారెడ్డి, నవంబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో కొత్తగా నిర్మించిన రెవెన్యూ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం అద్దె భవనంలో కొనసాగిన రెవెన్యూ కార్యాలయ భవనానికి అద్దెకూడా చెల్లించేలేదని విమర్శించారు. తనను ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాక పాత బకాయిలు చెల్లించడంతో పాటు మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి మరమ్మతు చేపట్టామన్నారు.

**సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం...**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఉర్దూ పాఠశాలకు వెళ్లే దారి కొరకు సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హేమంత్, ఆర్ఐ మదన్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ చీరలను పంపిణీ...**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తున్నామన్నారు. సవయం సహాయక సంఘాల ద్వార మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల కృషి చేస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.


రెవెన్యూ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# చీరల పంపిణీ ఎన్నికల స్టంట్

### ఎంపిటిసి ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్


మాట్లాడుతున్న దేవి రవీందర్

**గజ్వేల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రాష్ట్ర ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుందని ఎంపిటిసి ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బిఆర్ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండె మధు, తాటికొండ మధుసూదన్‌రెడ్డిలు విమర్శించారు. సోమవారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా మహిళలకు చీరలు ఇవ్వలేదని, ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మహిళల ఓట్లు దండుకోవడానికి చీరలు పంపిణీ చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండుగలను పురస్కరించుకొని బట్టలు పంపిణీ చేసేవారని, నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతు భరోసా, చీరల పంపిణీలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరలు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు మహిళలకు రూ.2వేలు ఇస్తామని, పెన్షన్ రూ.4వేలు ఇస్తామని, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని చెప్పి 420 దొంగ హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ది చెబుతారని హెచ్చరించారు.

### శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సం
## రాజగోపురం శుద్ధి చేయించిన అధికారులు

**కొమురవెల్లి, నవంబరు 24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవం, జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారి రాజగోపురంపై పేరుకుపోయిన దూళి, చెత్తను తొలిగిస్తూ శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా రాజగోపురాన్ని ఫైర్ ఇంజన్ సహాయంతో శుభ్రం చేయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంతంలో భక్తుల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో స్వచ్ఛత చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాజగోపురాన్ని శుభ్రం చేయడంతో ఆలయ ప్రాంగణం మరంత ఆహ్లాదకరంగా మారింది. స్వామి వారి కళ్యాణ మహోత్స ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్‌లో ఉచిత శిక్షణ : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 24, ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ ఈడి సెల్ ఆధ్వర్యంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, వరంగల్ వారి సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు 50 రోజుల పాటు ఉచిత టూవీలర్ సర్వీస్ టెక్నీషియన్ ట్రైనింగ్‌ను కల్పించనున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఇది పూర్తి రెసిడెన్షియల్ ట్రైనింగ్ అని, శిక్షణా కాలం లో ఉచిత భోజన, వసతి, ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పించబడతాయని, ట్రైనింగ్ పూర్తి చేసిన యువతకు కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిసి) ద్వారా సర్టిఫికెట్, ఉద్యోగాలు కల్పించబడతాయని ఆసక్తి కలిగి 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతి యువకులు తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ నైయనాదేవి 9440709807 నంబర్ ద్వారా సంప్రదించాలన్నారు. నమోదు చేసుకున్న యువతి, యువకులతో మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్‌లో ప్రారంభమవుతుందన్నారు.

## రేపు శ్రీ సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం

**వర్గల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** శ్రీసుబ్రహ్మణ్యస్వామి జన్మదినం పురస్కరించుకొని ఈనెల 26వతేదీ బుధవారం వర్గల్‌లోని విద్యాధరి క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్టి(స్కంద షష్టి) మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బుధవారం తెల్లవారుజామున సతీసమేతులైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, లక్ష పుష్పార్చన, దివ్యదర్శనం, శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పర్వదినం సందర్భంగా స్వామివారిని అర్చించి భగవంతుని కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు. లోక కళ్యాణార్థమై నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కాగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సిద్ధాంతి చంద్రశేఖరశర్మ వివరించారు.

## బస్టాండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

**గజ్వేల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో బస్టాండ్ల నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయని బిఆర్ఎస్ 3వ వార్డు నాయకుడు మర్కంటి కనకయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బస్టాండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా నేడు ప్రభుత్వం పనులు చేపట్టడం చేతగాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోనే బస్టాండ్ల నిర్మాణం 50శాతం పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా కనీసం బస్టాండ్ నిర్మాణం పూర్తిచేయకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలోనే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉండి కూడా ప్రతినిత్యం రాజీవ్ రహదారిపై వెళ్తున్నా బస్టాండ్ల నిర్మాణ పనులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బస్టాండ్‌లు పూర్తి కాకపోవడంతో ప్రయాణీకులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, బస్సు కోసం ఎదిరిచూసే మహిళలు బాత్రూమ్‌లు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## దుడ్డె చెరువు మత్తడి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

**కొండపాక, నవంబరు 24, ప్రభాతవార్త :** దుడ్డె చెరువు మత్తడి బ్రిడ్జిని మరమ్మతు చేయించాలని మంగోల్ మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్ చారి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగోల్ శివారులో మల్లన్న సాగర్‌కు వెళ్ళె రోడ్డులో ఉన్న దుడ్డె చెరువు మత్తడి కాలా కాలం క్రితం నిర్మించిందని అది ప్రస్తుతం కూలిపోయి ప్రజలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని నూతన మత్తడి బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

## ఆంక్షరెడ్డికి ఘన సన్మానం


ఆంక్షరెడ్డిని సన్మానిస్తున్న రాములుగౌడ్, సారిక శ్రీనివాస్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 24 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తూంకుంట ఆంక్షరెడ్డిని సోమవారం ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, వివిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వూడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నక్క రాములుగౌడ్, వూడెం సారికశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి సారథ్యంలో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని తూంకుంట ఆంక్షరెడ్డికి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దప్పు గణేష్, ఎస్సీ సెల్ పట్టణ నాయకుడు మన్నె అరుణ్‌కుమార్, పూజారి శ్రావణ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళీశ్వరుడికి మహాభిషేకం...

**నారాయణఖేడ్, నవంబరు 24 ప్రభాతవార్త**

నారాయణఖేడ్ వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఉదయం 9 గంటలకు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం, మహాహారతి నిర్వహించగా మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు చంద్రమోళీశ్వరుడికి పుష్పార్చన, హనుమాన్ చాలీసా,గీతా పారాయణం,లలితా సహస్ర నామావళి కార్యక్రమాలు 10 గంటల వరకు కొనసాగించారు. కాగా ప్రతి సోమవారం భక్త మార్కండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో,భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమం 10:30 నిమిషాలకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చంద్రమౌళీశ్వరుడి మహాభిషేకంలో పాల్గొన్న భక్తులు



బేగంపేట్‌లో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## బేగంపటలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**కంది, నవంబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బేగంపేట్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు రఘురాంగౌడ్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మహేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి తారబాయి రాంసింగ్‌నాయక్, మహిళా గ్రూపు అధ్యక్షులు రహేన, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు కళ్యాణి శ్రీనివాస్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జి.కుమార్, తీపిచెట్టి హరికృష్ణ, వేణుగౌడ్, సిహెచ్ యాదగిరి, జగదీష్ నాయక్, సాయి కిరణ్‌గౌడ్, సురేష్‌గౌడ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**



చీరలను పంపిణీ చేస్తున్న మీనా బేగం, శివకృష్ణ

**నాగల్‌గిద్ద, నవంబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మహిళలకు మహిళా సమైఖ్య మండల అధ్యక్షురాలు హీనాబేగం, తహసీల్దార్ శివకృష్ణతో కలిసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపిఓ నర్సింలు, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి సభ్యులు పండరినాథ్, కాంగ్రెస్ నాయకులు రహీమ్, నారాయణ్‌జాదవ్, సంజీవ్‌పాటిల్, సిసిలు శివానంద్, రాములు, సంగన్న, గాయప్ప, విఏఓలు తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు : పిడి మాధవి



ఎంపి సురేష్ షెట్కార్‌కు జీఓ కాపీలు అందజేస్తున్న హైవే అధికారులు

**పెద్దశంకరంపేట, నవంబర్ 24, ప్రభాతవార్త :** 161వ జాతీయ ప్రధాన రహదారిపై జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ సూచనల మేరకు సేఫ్టీ నిబంధనలను డిసెంబర్ నెలాఖరులోగా ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవే పీడి మాధవి సోమవారం తెలిపారు. ఇటీవల ఎంపీ సురేష్ షెట్కార్ నేషనల్ హైవే అథారిటీకి ప్రమాదాల నివారణకు పలు సూచనలిచ్చారు. దీంతో అధికారులు స్పందించి 161వ జాతీయ రహదారిపై సోలార్ బ్రింకర్లు, ఎంబీసీబిలు. మెయిన్ రోడ్డులో రబ్బర్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు పీడి తెలిపారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ నుండి వచ్చిన జీఓ కాపీలను ఎంపీ సురేష్ షెట్కార్ కు హైవే ఇన్సిడెంట్ మేనేజర్ మోయినొద్దిన్, ఎక్స క్యూటీవ్ జహంగీర్లు అందించారు.

## బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం : మాజీ ఎమ్మెల్యే



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిజెపి నాయకులు

**పెద్దశంకరంపేట, నవంబర్ 24, ప్రభాతవార్త :** బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు.. సోమవారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా నాయకులు కోణం విట్టల్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు.. ఇటీవల బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏకూటమికి ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులు గెలుపొందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, నాయకులు చందుపట్ల అనిల్, రహీం, ధ్రువకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థిని మనీషాసిర్వికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**గుమ్మడిదల, నవంబరు 24 ప్రభాతవార్త :** సృజనాత్మకత శాస్త్రీయ దృక్పథం ప్రదర్శిస్తూ వివేకానంద హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని మనిషా సిర్వి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్ 2024-2025 రాష్ట్రస్థాయి రౌండ్‌కు ఎంపికైందనీ చైర్మన్ చిమ్ముల జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషా సృష్టించిన వినూత్న ఆలోచన - వృద్ధుల కోసం బరువైన వస్తువులను శారీరక ఒత్తిడి లేకుండా ఎత్తుకునే సులభమైన యాంత్రిక పద్ధతి, ప్రాముఖ్యత, సరళత, సామాజిక ప్రభావం కారణంగా విస్తృతంగా ప్రశంసించబడిందన్నారు. ఆమె డిజైన్ శాస్త్రీయ నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా వృద్ధుల అవసరాల పట్ల సున్నితత్వాన్ని ప్రతిబింబిస్తుంది.మా విద్యార్థిని మనిషా విజయాన్ని గుర్తిస్తూ, స్కూల్ మేనేజెమెంట్ గర్వం వ్యక్తం చేసింది. విద్యార్థిని మనిషా సిర్వి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక కావడం స్కూల్ స్థానిక కమ్యూనిటీకి గర్వాన్ని నింపిన సంఘటనగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లత జైపాల్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**అల్లాదుర్గం, నవంబరు 24, ప్రభాతవార్త:** మహిళలను మహారాణులుగా(ఆర్థికంగా స్థిర పడేలా) చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళాశక్తి పథకం ఎంతగానో దోహదపడుతుందని మెదక్‌జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ చీరలను జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మిశేషారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 500 కోట్లు రుణాలు బ్యాంక్ లింకేజీ ద్వార అందించామన్నారు. ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలెండర్ సబ్సిడీ 13 కోట్ల రూపాయలను లక్ష 26 వేల కుటుంబాలకు అందించామని చెప్పారు. జిల్లాలో 9000 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి, మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలాంటి అనేక సంక్షేమ కార్యక్ర



మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణి చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మాలు మహిళలకు అందించి కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మచీరలను అందిస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో మార్చి 1వ తేదీ నుంచి వారం రోజులపాటు చీరలు పంపిణీ చేయనున్నారన్నారు.

**ఎంపిడిఓ కార్యాలయం సందర్శన...**

అల్లాదుర్గంలోని మండలపరిషత్ కార్యాలయాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించి ఎన్నికల నామినేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న గోవర్ధన్ రెడ్డి

## ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం

### బిఆర్‌ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల నవంబరు 24 ప్రభాతవార్త :** క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేది క్రీడలేనని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని భానూరులో ఆర్‌కె క్లబ్ నిర్వహించిన ఓపెన్ టు ఆల్ అండర్ 14 బాలికల క్రీడావిభాగంలో గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన స్పార్టెన్స్ టీమ్ మొదటి బహుమతి గెలుచుకుంది. మొదటి బహుమతి సాధించిన విద్యార్థులు, కోచ్‌లు సంపత్, మల్లేష్‌లతో కలిసి గుమ్మడిదలలోని సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,క్రీడలు యువతలో క్రమశిక్షణను, శారీరక దృఢత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇలాంటి ప్రతిభ వెలుగులోకి రావడం ఎంతో ఆనందదాయకం అని అన్నారు. యువత క్రీడలు, చదువుల్లో రాణించేందుకు సిజిఆర్ ట్రస్ట్ తరఫున అన్ని విధాల సహాయం అందిస్తామని గోవర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మగారిసదానంద రెడ్డి, కొత్తపల్లి మల్లేష్‌గౌడ్, విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : సుభాష్‌రెడ్డి



మహిళలకు చీరలను పంపిణి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చౌటకూరు, నవంబరు 24, ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిపి మాజీ అధ్యక్షులు సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌటకూరులో మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ శాయశక్తుల కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో నాడు ఇంటికే పరిమితం అయిన మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపిడిఓ కె శంకర్, ఎంఈఓ అనురాధ, కాంగ్రెస్ నాయకులు పార్కల రాంరెడ్డి, మంగలి చెన్నయ్య, మల్లికార్జున్ గౌడ్, సీఏలు గౌని కిరణ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**ఝరాసంగం, నవంబరు 24, ప్రభాతవార్త:** మహిళల సాధికరతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్ అన్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ చీరల పంపిణి నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, నాయకులు అస్రఫ్ అలీ, రాజేందర్‌సింగ్, బక్కప్ప, మల్లయ్య స్వామి, అన్సర్, పెంటయ్య పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సోయా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎం శ్రీదేవి

## సోయా కొనుగోలు కేంద్రాన్ని తనఖీ చేసిన డిఎం శ్రీదేవి

**కంగ్టి, నవంబరు 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం జిల్లా అధికారి మార్క్ ఫెడ్ ఏడీ శ్రీదేవి తనఖీ చేశారు. సోయాను కొనుగోలు చేస్తున్న కంగి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంను ప్రతి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సరైన సమయంలో కొనుగోలు, సరైన తూకం పెట్టి రైతులకు ఆదుకోవాలని, ఇప్పటి వరకు 2500 క్వింటాలు కొనుగోలు చేసారని, ప్రభుత్వం నిర్ణయించిన ధర 5328 అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు వారి వెంట పీఏసీఎస్ స్టాఫ్ అలాగే రైతులు ఉన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**వెల్దుర్తి, నవంబరు 24, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అత్యవసర చికిత్సలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తిలో 11 మంది లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సహాయక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం స్పందిస్తూ ఎప్పటికప్పుడు వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి. మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్. నాయకులు మల్లేశం. నరేందర్ రెడ్డి. తుపాతు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీఆదిపరాశక్తి అయ్యప్ప ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

**నర్సాపూర్, నవంబరు 24,ప్రభాతవార్త:** నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనగల అడవి ప్రాంతంలో అయ్యప్పస్వామి ఆలయకమిటీ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా శ్రీ ఆదిపరాశక్తి అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలు ఈనెల 24 నుండి 26 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవలో వేద పండితుల అధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిరోజు సోమవారం యాగశాల ప్రవేశం, విగ్నేశ్వరుని పూజా, మహా పుణ్య వచనము, మంగళవాయిద్య సంఘోషణ, వేదస్వస్తి, గోపూజ, భూతబలి, యాగశాలప్రవేశం, శైవశుద్ధి, పంచగవ్య ఆరాధన, యంత్ర విగ్రహ మార్జనలు, పంచగవ్య ప్రాశన, ఋత్విక్ వరుణ, దీక్షా కంకణధారణ, అఖండ దీపారాధన, మూలమంత్ర జపములు, చతుర్వేద సహిత చండీ సప్తశతి పారాయణములు నీరాజన, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నియామనిష్ఠలతో నిర్వహించారు. ఆలయంలో శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ గౌడ్ గురు స్వామి తెలిపారు. ఈ కార్యక్రమములో ఆది పరాశక్తి ఆలయ కమిటీ చైర్మన్ గురు స్వామి దుర్గప్పగారి అశోక్‌గౌడ్ గురుస్వామి దంపతులతో పాటు అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం

**నర్సాపూర్, నవంబరు 24, ప్రభాతవార్త:** పట్టణ శివారులో శ్రీఆదిపరాశక్తి అయ్యప్పస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నర్సాపూర్‌కు చెందిన ఇమ్మడి శ్రీనివాస్‌గుప్తా, ఇమ్మడి విశ్వనాథం రామ్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీఆదిపరాశక్తి అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అయ్యప్ప దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ముందు రోజు అయ్యప్ప స్వామి విగ్రహ ఊరేగింపు నిర్వహించగా సోమవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవంలో అయ్యప్ప దీక్షాస్వాములు భజనలు అయ్యప్ప నామ సంకీర్తనలతో అయ్యప్ప ఆలయ ప్రాంగణమంతా మారుమ్రోగిపోయింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా. ప్రముఖవ్యాపారవేత్త, నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, ప్రభాకర్ గుప్తా, సుధాకర్ గుప్తా, జ్ఞానేశ్వర్ గుప్తా, నోముల శ్రీనివాస్ గుప్తా, కొండ ఆనంద్ గుప్తా తో పాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అయ్యప్ప స్వామి దీక్ష స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# కబ్జాలకు గురవుతున్న భూములను కాపాడాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

**పటాన్‌చెరు, నవంబరు 24, ప్రభాతవార్త**

పెద్దకంజర్లలో కబ్జాలకు గురవుతున్న భూమిని కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం పెద్ద కంజర్ల ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జయరాజ్, మాణిక్యం మాట్లాడుతూ సర్వేనెంబర్ 120,121,125లలో రెండు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలో భూసేకరణ చేసిందని, ఎకరాకు 15 లక్షల 70వేలు నష్టపరిహారం ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ అనేకమంది రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదన్నారు. గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు జిల్లా కలెక్టర్ గ్రామస్తులు అందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీఇచ్చి, నేడు మోసం చేస్తున్నారని ఆరోపించారు. రెండు సంవత్సరాలు గడిచిన ఏ ఒక్కరికి ఇంటి స్థలం రాలేదన్నారు. సర్వేనెంబర్ 120, 121, 125లలో 50 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో కబ్జాలకు గురవుతున్న మండల రెవెన్యూ యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రైవేటు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

వ్యక్తులు ఆక్రమించుకొని యదేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నా రని, గ్రామస్తులు ఇంటి స్థలం కోసం ఒక గజం స్థలం ఆక్రమిస్తే పోలీసుల చేత చర్యలు చేపడుతున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు 40 నుంచి 50 ఎకరాల భూములు ఆక్రమిస్తున్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నేరేడు చెరువు సత్యనారాయణ రాజు, నరసింహ రాజుల చేతుల్లో పూర్తిగా కబ్జాలకు గురైందని చెప్పారు. అరబిందో తత్వాలు కంకర క్రషర్ ఏర్పాటు చేసుకొని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని, రెవెన్యూ వారితో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు చేతులుడికి చూస్తున్నారు మండిపడ్డారు. పెద్ద కంజర్ల భూముల పైన జిల్లా రెవెన్యూ యంత్రాంగం సమగ్ర దర్యాప్తు చేపట్టి, కబ్జాలకు గురవుతున్న భూమిని కాపాడి ,పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాయిలు, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాగభూషణము, ముత్యాలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సిసి రోడ్లు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## నల్లవల్లిలో అండర్ డ్రైనేజీ సిసి రోడ్లకు శంకుస్థాపన

**గుమ్మడిదల, నవంబరు 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో సోమవారం అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నేతలు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పటాన్ చెరు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ పట్టణాలను మొదలుకొని చివరి పల్లె వార్డు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే కాటా శ్రీనివాస్ గౌడ్ సారధ్యంలో మంత్రులను ఎమ్మెల్యేను కలిసి నిధులను కేటాయించి అభివృద్ధికి తోడ్పాటు చేసే విధంగా చర్యలు చూసుకుంటామని చెప్పారు. అలాగే నేడు మంగళవారం రోజున ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం ప్రతి గ్రామంలో ఉంటుందని అన్నారు. అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీలు సురభి నాగేంద్రగౌడ్, గోవర్ధన్‌గౌడ్, కావలి శంకర్, లక్ష్మీ మ్మనారాయణ, జైశంకర్ గౌడ్,పవన్,కాంగ్రెస్ నాయకులు రవి, రాజుగౌడ్, మాజీ ఎంపిటిసి కిష్టా గౌడ్, శివ, ఆశయ్య, నల్లవల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసత్యసాయిబాబా శతజయంతి

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 24, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నాడు రామాయంపేట సత్యసాయి సేవాసమితిలో ఉదయము నగర సంకీర్తన, పాదుక పూజ, పతాక ఆవిష్కరణ గావించారు. అనంతరం లింగాపూర్ ఆయుర్వేద ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్, చీరలు, బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. మధ్యాహ్నం పట్టణంలోని బస్టాండ్‌లో పులిహోర పంపిణీ చేశారు. సాయంత్రం మందిరంలో "జులా" కార్యక్రమం, భజనకార్యక్రమం నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాలలో సత్యసాయి సేవసమితి సభ్యులు ఎనిశెట్టి గౌరీ శంకర్, పైడి బాల్‌కిషన్, బానుశేకర్, స్నేహిత, భూలక్ష్మి మ్మ, సరిత, వి. యాదగిరి, దారం రమేష్, బాల్‌చందర్, లక్ష్మీ మ్మపతి, గందే నాగబూషణం, రాములు, కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

## అయ్యప్ప మాలధారణ చేపట్టిన స్వాములు

**పెద్దశంకరంపేట, నవంబరు 24, ప్రభాతవార్త :** వేణుగోపాలస్వామి ఆలయంలో అయ్యప్ప సన్నిధానంలో సోమవారం ఒకేసారి 43 మంది అయ్యప్ప మాలధారణ వేసుకుని అయ్యప్ప దీక్ష చేపట్టారు. రామచంద్రచారి గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు మాల ధారణ స్వీకరించారు.. 41 రోజులపాటు అయ్యప్ప స్వామి కఠిన దీక్ష చేపట్టి అనంతరం శబరిమలై తరలి వెళ్లనున్నట్లు గురుస్వామి రామచంద్ర చారి వివరించారు. అయ్యప్ప దీక్ష చేపట్టడం వలల మానసిక ప్రశాంతతతో పాటు ఎన్నో ఉపయోగాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు బాయ్ కాడి రామన్న. శ్రీహరి. సాయిరాం. పరంధాం. తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు రగ్గుల పంపిణీ

**జోగిపేట, నవంబరు 24, ప్రభాతవార్త:** రోడ్డుపై ఉండే నిరుపేదలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ చేశారు. సోమవారం జోగిపేటలోని జోగినాథ దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఉన్న నిరుపేతలకు రగ్గులను పంపిణీ చేశారు. అధ్యక్షులు రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ రగ్గులను పేదలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదరిశ సంతోష్, మాజీ అధ్యక్షులు యశ్వంత్‌రెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలను సన్మానం

**సదాశివపేట, నవంబరు 24 (ప్రభాతవార్త):** మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ 2025లో ప్రథమ స్థానం సాధించిన జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు రోహన్‌రెడ్డి, తహేర యూసుఫ్, ఖాజామొయినుద్దీన్‌లను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. సదాశివపేట పట్టణం,మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్న ఈ టాలెంట్ టెస్ట్ లో జీనియస్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినందుకు అభినందనలు తెలిపారు.విద్యార్థులు అన్ని రంగాలలో ప్రథమ స్థానం సాధిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో లో పాఠశాల చైర్మన్ ముద్ద నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి ప్రిన్సిపల్ ప్రీతి, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, ఉమారాణి, రాణా ప్రతాప్ సాయి కిరణ్ పాల్గొన్నారు.

## వరి కొయ్యలను దహనం చేస్తే ముప్పు తప్పదు : ఏవో

**అల్లాదుర్గం, నవంబరు 24, ప్రభాతవార్త:** వరి కొయ్యలను వ్యవసాయ భూమిలో దహనం చేస్తే నేలకు, పర్యావరణానికి ముప్పు తప్పదని మండల వ్యవసాయ అధికారి రాజేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వరి సాగు విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయని, పశువులకు బదులుగా యంత్రాలను వాడుతున్నారని గుర్తు చేశారు. యంత్రాలతో వరి కోతలు జరుగుతుండటంతో వరి కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయని, భూమిని దున్నే తరుణంలో నాగళ్లకు వరి కొయ్యలు అడ్డుగా వస్తున్నాయన్నారు. రైతులు వరికొయ్యలతోపాటు మొక్కజొన్న కొయ్యలను, గడ్డిని కాల్చేస్తున్నారని, ఫలితంగా భూమి సారం తగ్గడంతో పాటు పర్యావరణానికి ముప్పు తప్పదన్నారు. కొయ్యలను భూమిలోనే దున్నేస్తే సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, ఫలితంగా పంట దిగుబడి మెరుగవుతుందన్నారు. దుక్కి దున్నే తరుణంలో సింగిల్ సూపర్ పాస్పేట్ ఎకరాలకు 25 నుంచి 30 కిలోలు చల్లితే అవశేషాలు 2 వారాల్లో మురిగి పోషకాలుగా మారుతాయని,మొక్కలకు 2 శాతం నత్రజని (యూరియా), 4శాతం పాస్పరస్ అదనంగా అందుతుందన్నారు. కొయ్యలను కాల్చడంతో కలిగే నష్టాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్ కుమార్, రెడ్డిపల్లి రైతులు నరసింహరెడ్డి పాల్గొన్నారు.

## కాశిపూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ

**కంది, నవంబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాశిపూర్‌లో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను ఇందిరమ్మ కమిటి ఆధ్వర్యంలో పంపిణి చేశారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు కృష్ణగౌడ్, మండల ఐకెపి ఎపిఎం శివలక్ష్మి, ఇందిరమ్మ కమిటీలు సర్దార్ గోపాల్, పంచాయితీ కార్యదర్శి రమేష్, సిఏ స్వప్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శృతి గౌడ్, ఉపాధ్యక్షులు వీరమణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జహీరాబాద్‌లో ఐక్యతా మార్చ్

**జహీరాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త:** సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 25న జహీరాబాద్ పట్టణంలో ఐక్యత మార్చ్‌ను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాల నుంచి పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరై మార్చ్‌ను జండా ఊపి ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా ఆర్‌డిఓ దేవూజా హాజరవుతారు. పట్టణంలోని ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యారథ్థులు, పట్టణ యువత, యువజన సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు.

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### -వసతి గృహం విద్యార్థులతో ఎస్ఐ విశ్వజన్

**పుల్‌కల్, నవంబరు 24, ప్రభాతవార్త:** విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను క్రమ శిక్షణతో అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ విశ్వజన్ సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ విశ్వజన్ మాట్లాడుతు క్రమ శిక్షణతో ఏదైన సాధించవచ్చన్నారు. విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ దస్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.